PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 218 | సంపుటి 4 | శనివారం | 25-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర




తెలంగాణ పల్లెల్లో ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ సెగలు ముదురుతున్నాయి. ముఖ్యంగా కేసముద్రం మండల కేంద్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వేడి ఇప్పుడే పతాక స్థాయికి చేరింది. గత పదేళ్ల పాలకుల వైఫల్యాలు, నిధుల లేమితో కునారిల్లుతున్న అభివృద్ధి, ప్రజాప్రతినిధులపై వ్యక్తమవుతున్న తీవ్ర అసంతృప్తి వెరసి.. ఈసారి ఓటరు ఎటువైపు మొగ్గు చూపుతాడన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. గతంలో గెలిచిన నేతలు కేవలం సర్వసభ్య సమావేశాలకే పరిమితమై, గ్రామాలకు పైసా నిధులు తేలేక 'ఉత్సవ విగ్రహాలు'గా మిగిలిపోయారన్న ఆగ్రహం సామాన్య జనం నుంచి బలంగా వినిపిస్తోంది. సర్పంచ్ లకే పెండింగ్ బిల్లులు ఇవ్వలేని దుస్థితిలో, ఇక జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు నిధులు ఎక్కడ నుంచి వస్తాయన్నది సామాన్యుడిని వేధిస్తున్న సూటి ప్రశ్న. ఈ రాజకీయ అస్థిరత మధ్య, ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు సవాల్ విసురుతూ 'ఇండిపెండెంట్లు' తెరపైకి రావడం గమనార్హం. పార్టీ రంగులు, జెండాల కంటే వ్యక్తిగత ఇమేజ్, సామాజిక బాధ్యతే ఎజెండాగా యువత పెద్ద ఎత్తున బరిలోకి దిగేందుకు సిద్ధమవుతుండటంతో మండల రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు మొదలయ్యాయి. కేసముద్రం మున్సిపల్ ఎన్నికల్లో అధికార, విపక్షాలకు లభించిన సమాన బలాబలాలు ఇప్పుడు ఈ 'స్థానిక' పోరును మరింత రసవత్తరంగా మార్చాయి. నిశ్శబ్ద విప్లవం దిశగా అడుగులు వేస్తున్న కేసముద్రం ఓటరు, ఈ మే నెలలో ఎవరికి పట్టం కడతాడు? అభివృద్ధికి ఊపిరిపోసే నేతను ఎంచుకుంటాడా లేక పార్టీల మాయలో పడతాడా? అన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి రేపుతోంది.

—ప్రభాత గమనం, హైదరాబాద్

## కేసముద్రంలో
# పరిషత్ జోరు..

2

## పార్టీల గుండెల్లో స్వతంత్రుల గుబులు!

- రంగంలోకి యువత, ఇండిపెండెంట్లు
- పాత నేతలపై పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత..
- 'గెలిచి ఏం చేశారు?'.. ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న ఓటర్లు
- ఫలానా పనులు చేశామని పార్టీలు చెప్పుకోలేని దుస్థితి
- ఎక్కడి గొంగలి అక్కడే వదిలేసి పదవులు అనుభవించిన వైనం
- కొత్తగా గెలిచేవారు ఏం చేస్తారని అయోమయంలో జనం
- అసలు జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు వచ్చే నిధులు సద్వినియోగం అయ్యేనా..?
- సర్పంచ్ లకే బకాయిలు ఇవ్వలేని ప్రభుత్వాలు ఇప్పుడు ఇస్తుందా..?
- స్థానిక సంస్థల ఎన్నికలు మే నెలలో జరిగే ఛాన్స్?
- మండల కేంద్రంలో ఎన్నికలపై తీవ్ర చర్చ

## తెలంగాణలో
# ఐఏఎస్‌ల బదిలీ

- హోం శాఖ కార్యదర్శిగా శిఖా గోయల్.. 'ఫ్యూచర్ సిటీ' సీపీగా తరుణ్ జోషి
- కీలక విభాగాలకు ఐపీఎస్ అధికారుల బదిలీ.. సర్కార్ ఉత్తర్వులు
- విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్.. డ్రగ్స్ కంట్రోల్ బాధ్యతల్లో అవినాష్ మొహంతి
- పాలనలో వేగం, పారదర్శకత లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణ

2

## కేసముద్రంలో ఆయిల్ పామ్
# గెలల సేకరణ కేంద్రం ప్రారంభం

- రైతు ముంగిటకే మార్కెటింగ్ సౌకర్యం
- మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న



3

# అశ్రునయనాల మధ్య శంకర్‌గౌడ్ అంత్యక్రియలు

- నర్సంపేటలో తీవ్ర ఉద్రిక్తత..
- డిపో వద్దకు మృతదేహం తరలింపునకు పోలీసుల అడ్డంకి
- రహదారిపై బైఠాయించిన ఆర్టీసీ కార్మికులు
- ముత్తోజిపేటలో నివాళులర్పించిన కేంద్రమంత్రి బండి సంజయ్
- కుటుంబానికి అండగా ఉంటాం :సీఎం రేవంత్ రెడ్డి హామీ

2

తెలంగాణ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య ఘటన, తీవ్ర ఉద్రిక్తతల మధ్య విషాదాంతమైంది. తన తోటి 40 వేల మంది కార్మికుల హక్కుల కోసం నిప్పుల కొలిమిగా మారి ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ అంత్యక్రియలు శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో ముగిశాయి. మృతదేహాన్ని ఆఖరిసారిగా తను పని చేసిన నర్సంపేట డిపోకు తరలించేందుకు కుటుంబ సభ్యులు, కార్మికులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకోవడంతో రోజంతా ఉత్కంఠ నెలకొంది.

— ప్రభాత గమనం, నర్సంపేట



# కేసముద్రంలో ఎన్నికల జోరు..

## పార్టీల గుండెల్లో స్వతంత్రుల గుబులు!

- రంగంలోకి యువత, ఇండిపెండెంట్లు
- పాత నేతలపై పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత..
- 'గెలిచి ఏం చేశారు?'.. ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న ఓటర్లు
- ఫలానా పనులు చేశామని పార్టీలు చెప్పుకోలేని దుస్థితి
- ఎక్కడి గొంగలి అక్కడే వదిలేసి పదవులు అనుభవించిన వైనం
- కొత్తగా గెలిచేవారు ఏం చేస్తారని అయోమయంలో జనం
- అసలు జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు వచ్చే నిధులు సద్వినియోగం అయ్యేనా..?
- సర్పంచ్ లకే బకాయిలు ఇవ్వలేని ప్రభుత్వాలు జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఇస్తుందా..?
- స్థానిక సంస్థల ఎన్నికలు మే నెలలో జరిగే ఛాన్స్?
- మండల కేంద్రంలో ఎన్నికలపై తీవ్ర చర్చ



హైదరాబాద్, ప్రభాత గమనం:

కేసముద్రం మండల కేంద్రంలో రాజకీయ సెగలు పుడుతున్నాయి. వచ్చే మే నెలలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న వేళ మండలంలో ఎన్నికల చర్చ రచ్చకెక్కింది. గత పదేళ్ల అనుభవాలు, పాలకుల వైఫల్యాలు, నిధుల లేమి వెరసి.. కేసముద్రం మండలంలో ఈసారి ఓటరు నాడి ఎటువైపు ఉందనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.గత ప్రభుత్వాల హయాంలో గెలిచిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులపై మండల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పదేళ్ల పదవి కాలంలో "ఎక్కడి గొంగళి అక్కడే" అన్న చందంగా పనులు మిగిలిపోవడంతో గెలిచిన నేతలు ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితిగా నెలకొంది.కేవలం సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడం తప్పా, తమ పరిధిలో గ్రాంట్లు లేకపోవడంతో నేతలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.సర్పంచ్‌లకే పెండింగ్ బిల్లులు ఇవ్వలేని ప్రభుత్వాలు, ఇక జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు నిధులు ఎలా ఇస్తాయనేది సామాన్య జనం వేస్తున్న సూటి ప్రశ్న.ఈ దఫా ఎన్నికల్లో మార్పు కోరుతూ యువత పెద్ద ఎత్తున బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా మండల కేంద్రంలో బలమైన ఇండిపెండెంట్ అభ్యర్థులు జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేయబోతున్నారనే ప్రచారం ప్రధాన పార్టీలలో వణుకు పుట్టిస్తోంది. పార్టీ జెండాల కంటే వ్యక్తిగత ఇమేజ్ కే సామాజిక బాధ్యత,స్థానిక సమస్యల పరిష్కారమే ఎజెండాగా స్వతంత్రులు వ్యూహాలు రచిస్తున్నారు.ఇటీవల జరిగిన కేసముద్రం మున్సిపల్ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే, అధికార-విపక్ష పార్టీలు సమాన బలాబలాలతో ఉన్నాయని స్పష్టమవుతోంది.

### ప్రధాన పార్టీలో అభ్యర్థులపై చర్చ

దీంతో ప్రధానపార్టీల అభ్యర్థులు ఎవరనేది ఇప్పటికే మండలంలోని ఆయా పార్టీల్లో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ప్రధానపార్టీలు ఏం చెప్పి ఓటర్లను ఓట్లు అడుగుతాయనేది కూడా ఆసక్తిగా మారింది. ఎందుకంటే బీఆర్ఎస్‌లో ప్రభుత్వ హాయంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆ పార్టీకి మంచి పేరు తెచ్చి పెట్టాయి. ఇటు కాంగ్రెస్‌కి ఒకింత ప్రజా వ్యతిరేకత ఉన్నప్పటికీ..కేసముద్రం మండల కేంద్రంలో వేం నరేందర్ రెడ్డి చొరవతో స్థానికంగా జరుగుతున్న పనులు ఆ పార్టీకి కలిసొచ్చే అవకాశం లేకను పోలేదు.ఇకపోతే మొన్నటికి మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తొలి మున్సిపాలిటీ కేసముద్రంలో అధికార విపక్షాలకు సరిసమానంగా సీట్లు వచ్చాయంటే.. మండలంలో ప్రధానపార్టీలకు సమాన బలాలు ఉన్నాయనే సందేశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఏవిధంగా ఆయాపార్టీలు నిలదొక్కుకుంటాయన్నది మండలంలో కొంత ఆసక్తి రేపుతోంది.

### బరిలో ఇండిపెండెంట్లు

కొత్తగా బరిలో నిలిచే అభ్యర్థులు మండల కేంద్రంలో చేయబోయే పనులేంటో చెప్పుకొని బరిలో ఉండాల్సి ఉంది. అయితే.. వీరికి ప్రత్యేక నిధులే లేనప్పుడు ఏవిధమైన హామీలు ఇస్తారన్నది కూడా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. అటు రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా.. ప్రతిపక్షాన్ని ఢీకొట్టి ప్రతిపక్ష పార్టీని తలదన్నే బలాన్ని నిరూపించుకోలేని పరిస్థితి కూడా కానొస్తోంది. అటు.. ఇండిపెండెంట్లు బలంగా ఢీకొనాలని ఇప్పటికే కసరత్తులు మొదలుపెట్టారు. అధికార, విపక్షాలను తలదన్నీ ఇండిపెండెంట్ అభ్యర్థులు బరిలో నిలవాలని ప్లాన్ చేస్తున్నారు. ఆర్థికంగా, సామాజికంగా అన్ని అవకాశాలు కలిసొచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీంతో.. మండల కేంద్రంలో జరగబోయే ఈ ఎన్నికలు మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉంది. ఏవిధమైన హామీలు ఇవ్వబోతున్నారు.. మండల ప్రజలను ఏవిధంగా తమవైపు తిప్పుకుంటారు.. ఏకొత్త ఎత్తుగడలతో ముందుకొస్తున్నారన్నది ఆసక్తిరేపుతోంది. పైస్థాయి ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు రానప్పుడు కేవలం మాటలతో ఓటర్లను ఎలా బుజ్జగిస్తారన్నది ఆసక్తికరంగా మారింది."కేసముద్రం రాజకీయాల్లో ప్రస్తుతం 'నిశ్శబ్ద విప్లవం' కనిపిస్తోంది. పార్టీల రంగుల కంటే, పనిచేసే వ్యక్తులకే పట్టం కట్టాలని జనం యోచిస్తున్నారు. ముఖ్యంగా స్వతంత్ర అభ్యర్థుల ఎంట్రీతో సమీకరణాలన్నీ మారిపోయే అవకాశం ఉంది. మే నెలలో జరిగే ఈ సమరం కేసముద్రం భవిష్యత్తుకు ఒక దిక్సూచి కానుంది."

# తెలంగాణలో ఐపీఎస్ ల బదిలీలు

- హోం శాఖ కార్యదర్శిగా శిఖా గోయల్.. 'ఫ్యూచర్ సిటీ' సీపీగా తరుణ్ జోషి
- కీలక విభాగాలకు ఐపీఎస్ అధికారుల బదిలీ.. సర్కార్ ఉత్తర్వులు
- విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్.. డ్రగ్స్ కంట్రోల్ బాధ్యతల్లో అవినాష్ మొహంతి
- పాలనలో వేగం, పారదర్శకత లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ప్రభాత గమనం):

తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయి పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేయడం, కొత్తగా ఏర్పాటవుతున్న విభాగాలను బలోపేతం చేసే లక్ష్యంతో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా హోం శాఖ, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వంటి ప్రాధాన్యత కలిగిన విభాగాల్లో జరిగిన మార్పులు ఇప్పుడు పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

శిఖా గోయల్‌కు కీలక బాధ్యత రాష్ట్ర హోం శాఖ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్‌ను ప్రభుత్వం నియమించింది. అత్యంత కీలకమైన ఈ పరిపాలనా బాధ్యతలను మహిళా అధికారికి అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అటు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను నియమిస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. అవినీతి నిరోధక చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల పర్యవేక్షణలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

ఫ్యూచర్ సిటీ, మల్కాజిగిరిలకు కొత్త కమిషనర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు. సుధీర్ బాబు రిటైర్మెంట్ నేపథ్యంలో తరుణ్ జోషికి ఈ అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బి. సుమతిని నియమించింది.

### ఇతర కీలక నియామకాలు:

**డ్రగ్స్ కంట్రోల్:** మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా అవినాశ్ మొహంతిని నియమించారు.

**ఇంటెలిజెన్స్:** ఎస్ఐబీ (ఇంటెలిజెన్స్) అదనపు బాధ్యతలను కార్తికేయకు అప్పగించారు.

**మల్టీజోన్:** మల్టీజోన్-2 ఐజీపీగా షానవాజ్ ఖాసిం బదిలీ అయ్యారు.

ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ బదిలీలు పోలీస్ యంత్రాంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనున్నాయి. కీలక విభాగాల్లో అనుభవజ్ఞులైన అధికారుల నియామకం ద్వారా రాష్ట్ర భద్రతా వ్యవస్థ మరియు పరిపాలనలో మరింత వేగం, పారదర్శకత వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.



# తెరుచుకున్న కేదార్‌నాథ్ దేవాలయం

- హిమగిరుల్లో మార్మోగిన హరహర మహాదేవ నామస్మరణ
- అంగరంగ వైభవంగా చార్ ధామ్ యాత్ర ప్రారంభం
- తొలి రోజే వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం

డెహ్రాడూన్, ప్రభాత గమనం:

ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కేదార్‌నాథ్ ధామం బుధవారం అత్యంత వైభవంగా తెరుచుకుంది. గఢ్వాల్ హిమాలయాల పర్వత శ్రేణుల్లో కొలువైన ఈ పరమశివుని ఆలయ ద్వారాలను వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య తెరిచారు. దీనితో ఈ ఏడాదికి సంబంధించిన ప్రసిద్ధ చార్‌ధామ్ యాత్ర అధికారికంగా ఊపందుకుంది.

### జనసంద్రమైన కేదార్ లోయ

ఆలయ ద్వారాలు తెరుచుకున్న తొలి రోజే దేశవిదేశాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు చలిని సైతం లెక్కచేయకుండా క్యూలైన్లలో వేచి చూశారు. శివనామ స్మరణతో హిమాలయ పర్వతాలు ప్రతిధ్వనించాయి. ఆలయ ప్రాంగణాన్ని టన్నుల కొద్దీ రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

### పోటెత్తిన భక్తజనం

శీతాకాలం కారణంగా గత ఆరు నెలలుగా మూసి ఉన్న ఈ ఆలయం, ఇప్పుడు పునఃప్రారంభం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారాయి. యాత్రికుల సౌకర్యార్థం ఉత్తరాఖండ్ ప్రభుత్వం మరియు దేవస్థానం బోర్డు విస్తృత ఏర్పాట్లు చేశాయి. వాతావరణ పరిస్థితులను బట్టి యాత్రికులు తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# జాతీయ రహదారులపై 'రక్తపాతం'..

- వేర్వేరు ప్రమాదాల్లో 20 మందికి గాయాలు
- నిజామాబాద్ జిల్లాలో ఆగి ఉన్న బస్సును ఢీకొన్న లారీ
- ఖమ్మం జిల్లాలో కారును ఢీకొట్టి.. డివైడర్ పైకి దూసుకెళ్లిన ట్రక్కు

నిజామాబాద్/పెనుబల్లి, ప్రభాత గమనం:

రాష్ట్రంలోని జాతీయ రహదారులపై శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలు ప్రయాణికులను భయాందోళనకు గురిచేశాయి. నిజామాబాద్ మరియు ఖమ్మం జిల్లాల్లో జరిగిన ఈ ఘటనల్లో సుమారు 20 మందికి పైగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ల అజాగ్రత్త, మితిమీరిన వేగమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలుస్తోంది.

### ఆర్గుల్ వద్ద ఆగి వున్న బస్సును ఢీకొన్న లారీ

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం ఆర్గుల్ వద్ద 44వ జాతీయ రహదారిపై పెను ప్రమాదం సంభవించింది. రహదారి పక్కన ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును, దాని వెనుక ఉన్న మరో లారీని వేగంగా వచ్చిన ఒక ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి బస్సులో ఉన్న ప్రయాణికుల్లో సుమారు 20 మందికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు కలిసి బాధితులను చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం కారణంగా నేషనల్ హైవేపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు.

### ఖమ్మం జిల్లాలో డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ

మరోవైపు ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి వద్ద కూడా ఘోర ప్రమాదం తప్పింది. వేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా సదరు లారీ డివైడర్‌పైకి ఎక్కి సుమారు 100 మీటర్ల దూరం వరకు దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. కారులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# నేషనల్ అప్రెంటిస్షిప్ ట్రైనింగ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.రవి

ప్రభాత గమనం , హనుమకొండ :

డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులైన విద్యార్థులు నేషనల్ అప్రెంటిస్షిప్ ట్రైనింగ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్ అధ్యక్షతన నేషనల్ అప్రెంటిస్ట్ ట్రైనింగ్ స్కీం పై జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటిఐ ప్రిన్సిపల్స్ తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ నేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ స్కీమ్ కు దరఖాస్తు చేసుకొని శిక్షణ తీసుకోవడం ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకొని తద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని పేర్కొన్నారు. అప్రెంటిస్షిప్ సమయంలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం రూ. 4వేలను అందిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యాసంస్థలు నేషనల్ అప్రెంటిస్షిప్ ట్రైనింగ్ స్కీం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ స్కీంకు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ స్కీం చెన్నై డైరెక్టర్ విజయ్ శేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, జిల్లా రవాణాశాఖ అధికారి వేణుగోపాల్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటిఐ ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



# అశ్రునయనాల మధ్య శంకర్‌గౌడ్ అంత్యక్రియలు

- నర్సంపేటలో తీవ్ర ఉద్రిక్తత..
- డిపో వద్దకు మృతదేహం తరలింపునకు పోలీసుల అడ్డంకి
- రహదారిపై బైఠాయించిన ఆర్టీసీ కార్మికులు, విపక్ష నేతలు
- ముత్తోజిపేటలో నివాళులర్పించిన కేంద్రమంత్రి బండి సంజయ్
- కుటుంబానికి అండగా ఉంటాం :సీఎం రేవంత్ రెడ్డి హామీ



ప్రభాత గమనం, నర్సంపేట:

తెలంగాణ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య ఘటన, తీవ్ర ఉద్రిక్తతల మధ్య విషాదాంతమైంది. తన తోటి 40 వేల మంది కార్మికుల హక్కుల కోసం నిప్పుల కొలిమిగా మారి ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ అంత్యక్రియలు శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో ముగిశాయి. మృతదేహాన్ని ఆఖరిసారిగా తను పని చేసిన నర్సంపేట డిపోకు తరలించేందుకు కుటుంబ సభ్యులు, కార్మికులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకోవడంతో రోజంతా ఉత్కంఠ నెలకొంది.

### రణరంగంగా నర్సంపేట-మల్లంపల్లి రహదారి

హైదరాబాద్ నుంచి శంకర్ గౌడ్ భౌతికకాయాన్ని ముత్తోజిపేటలోని ఆయన కుమార్తె నివాసానికి తరలించగానే వందలాదిగా కార్మికులు, రాజకీయ నాయకులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళ్లి నివాళులర్పించేందుకు అనుమతించాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు ససేమిరా అనడంతో ఆగ్రహించిన కార్మికులు మల్లంపల్లి రహదారిపై బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణులు, కార్మికుల మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

### కేంద్రమంత్రి బండి సంజయ్ భీష్మం నివాళి

మధ్యాహ్నం ముత్తోజిపేట చేరుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్, శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. "కార్మికుడి ఆత్మకు శాంతి కలగాలంటే డిపోకు తీసుకెళ్లనివ్వాలి, ఇందులో ప్రభుత్వ అభ్యంతరమేంటి?" అని పోలీసులను నిలదీశారు. అనుమతి ఇచ్చే వరకు కదిలేది లేదని ఆయన అక్కడే భీష్మించారు. చివరకు ఉన్నతాధికారులతో చర్చల అనంతరం పోలీసులు మెత్తబడటంతో, జేఏసీ నేతలు, కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించేందుకు అంగీకరించారు.

### కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

"మాకు సొంత ఇల్లు కూడా లేదు.. అందరి బాగు కోసం మా నాన్న ప్రాణత్యాగం చేశారు" అని శంకర్ గౌడ్ కుమార్తె విలపించడం అక్కడి వారిని కలిచివేసింది. రిటైర్మెంట్ తర్వాత వచ్చే డబ్బులతో ఇల్లు కట్టుకోవాలని కలలు కన్న వ్యక్తి, తోటి కార్మికుల కోసం బలికావడంపై భార్య కన్నీరుమున్నీరయ్యారు.

### ప్రభుత్వం తరపున ఆదుకుంటాం: సీఎం రేవంత్

శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.

# కేసముద్రంలో ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రం ప్రారంభం

- రైతు ముంగిటకే మార్కెటింగ్ సౌకర్యం
- మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న



కేసముద్రం, ఏప్రిల్ 24(ప్రభాత గమనం) :

తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడమే కాకుండా, పండించిన పంటను అమ్ముకునేందుకు వీలుగా విక్రయ కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ,టి.జి. ఆయిల్ ఫెడ్ సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్యతో కలిసి ఘనంగా ప్రారంభించారు.రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడారు..ఈ కేంద్రం ఏర్పాటు స్థానిక రైతులకు ఒక వరం అని కొనియాడారు.గతంలో పంటను అమ్ముకోవడానికి దూరాభారం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు కేసముద్రం మార్కెట్‌లోనే సేకరణ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గి రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.సంప్రదాయ పంటల కంటే ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.రైతు పక్షపాతిగా నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ అధికారులకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కేంద్రాన్ని పరిసర ప్రాంతాల ఆయిల్ పామ్ రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి నాయకులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.



## ప్రియుడి మోజులో పడి ఐదేళ్ల కొడుకుని అంతం చేసిన తల్లి

- బుద్ధిమాంద్యం ఉన్నప్పటికీ కనికరించని కసాయిలు
- నేలకేసి కొట్టి, గొంతు నులిమి కిరాతక హత్య
- కామారెడ్డి శ్రీరాంనగర్ లో కలకలం..నిందితులిద్దరి అరెస్ట్

కామారెడ్డి క్రైమ్, ప్రభాత గమనం: క్షణిక సుఖం కోసం ఓ తల్లి కన్నపేగు బంధాన్ని తెంచుకుంది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని అభంశుభం తెలియని ఐదేళ్ల కుమారుడిని ప్రియుడితో కలిసి అంతం చేసింది. కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో జరిగిన ఈ కిరాతక ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బుద్ధిమాంద్యంతో తన లోకంలో తానుండే ఆ పసివాడిని మృత్యుఒడికి చేర్చి, ఏమీ తెలియనట్లు నాటకమాడిన నిందితుల అసలు రంగును పోలీసులు బట్టబయలు చేశారు.

### పథకం ప్రకారమే ఘాతుకం

రాజంపేట మండలానికి చెందిన లక్ష్మి అలియాస్ రజితకు భర్తతో విభేదాలు రావడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి కామారెడ్డికి మకాం మార్చింది. ఈ క్రమంలో నర్సింహులు అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. గత ఆరు నెలలుగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. అయితే, లక్ష్మి కుమారుడు శ్రావణ్ (5) బుద్ధిమాంద్యంతో బాధపడుతుండటం, తమ ఏకాంతానికి అడ్డుగా మారుతున్నాడని వారు భావించారు. వారం రోజుల క్రితమే బాలుడిని వదిలించుకోవాలని పథకం పన్నారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం పథకం ప్రకారం లక్ష్మి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న నర్సింహులు ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రావణ్ పై దాడి చేశాడు. పసివాడని కూడా చూడకుండా నేలకేసి కొట్టి, గొంతు నులిమి ప్రాణాలు తీశాడు. ఆ తర్వాత బాలుడికి ఏదో జరిగిందని నమ్మిస్తూ ఆసుపత్రికి తరలించి డ్రామా ఆడాడు. అయితే, బాలుడి శరీరంపై గాయాలు చూసి అనుమానం వచ్చిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. రాజంపేటకు చెందిన బంధువుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా, నర్సింహులు నేరాన్ని అంగీకరించాడు. ఈ ఘాతుకానికి తల్లి లక్ష్మి సహకారం కూడా ఉందని తేలడంతో ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సమాజంలో నైతిక విలువల పతనాన్ని చాటుతోంది. వివాహేతర సంబంధాల మోజులో పడి కన్న బిడ్డలనే కడతేరుస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. భార్యాభర్తల మధ్య గొడవలు, క్షణిక సుఖాల వేటలో బలైపోతున్నది మాత్రం అభంశుభం తెలియని చిన్నారులే.

## హెయిర్ బస్సు డ్రైవర్ల శ్రమ దోపిడీ ఆపాలి

- కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగన్న
- మహబూబాబాద్ డిపో ఎదుట డ్రైవర్ల సమావేశం



మహబూబాబాద్, ఏప్రిల్ 24(ప్రభాత గమనం):

ఆర్టీసీలో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న హెయిర్ బస్సు డ్రైవర్ల పట్ల యాజమాన్యాలు అనుసరిస్తున్న మొండి వైఖరిని వీడాలని, వారి శ్రమ దోపిడీని తక్షణమే అరికట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ డిపోలో పాక చంద్రశేఖర్ అధ్యక్షతన హెయిర్ బస్సు డ్రైవర్ల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగన్న ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్ల సమస్యలపై గళమెత్తారు.సమావేశంలో నాగన్న మాట్లాడారు..డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం,యాజమాన్యాల తీరును తప్పుబట్టారు.పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి డ్రైవర్‌కు నెలకు ₹26,000 కనీస వేతనం చెల్లించాలన్నారు.ప్రభుత్వ డ్రైవర్లతో సమానంగా పనిచేస్తున్న వీరికి కూడా సమాన వేతన సూత్రాన్ని వర్తింపజేయాలని తెలిపారు.ప్రతి డ్రైవర్‌కు ఈఎస్ఐ , పీఎఫ్ సౌకర్యంతో పాటు యాజమాన్యమే వ్యక్తిగత ఇన్సూరెన్స్ చేయించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, వారిని కాంట్రాక్టు పద్ధతిలో గుర్తించాలన్నారు.ఇళ్లు లేని డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లు కేటాయించాలని,రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిందని, 60 మంది సామర్థ్యం ఉన్న బస్సులో 100 నుండి 150 మంది ప్రయాణిస్తుండటంతో డ్రైవర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు. మితిమీరిన రద్దీ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ విషయంలో డ్రైవర్లపై వేధింపులు ఆపాలని కోరారు.గత మూడు రోజులుగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు హెయిర్ బస్సు డ్రైవర్ల యూనియన్ పూర్తి మద్దతు ప్రకటించిందని తెలిపారు. ఇదే క్రమంలో నిన్న మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి యూనియన్ తరపున ప్రగాఢ సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గడ్డం శ్రావణ్, వెంకటేష్, రవీందర్, మహేందర్, రాజు, రాకేష్, కొమురవెల్లి వంశీ, మధు, ఐలయ్య, కృష్ణ, శ్రీశైలం, మోహన్ రాజు, వెంకన్న, ఐలేష్, ఉపేందర్, నాగరాజు, వీరన్న, వీరస్వామి, యాకన్న, దుర్గేష్, నగేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై స్పందించాలి

- నర్సంపేట ఘటన బాధాకరం
- ఏఐసీటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు మరిపెల్లి మొగిలి



కేసముద్రం, ఏప్రిల్ 24(ప్రభాత గమనం) :

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వారి డిమాండ్లను పరిష్కరించాలని ఎంసిపిఐ(యు) అనుబంధ కార్మిక సంఘం ఏఐసిటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు మరిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. శుక్రవారం కేసముద్రంలో ఆయన మాట్లాడారు..ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పట్టించుకోకపోవడం వల్లే సమ్మెకు దారితీసిందని ఆయన పేర్కొన్నారు. నర్సంపేటలో ఒక ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బాధాకరమని, ఇది కార్మికుల మానసిక ఒత్తిడికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే పే స్కేలు వర్తింప చేస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. వేతన సవరణలు, ఉద్యోగ భద్రత, పెండింగ్ బకాయిల చెల్లింపులు వంటి అంశాలు అత్యవసరంగా పరిష్కరించాల్సినవని తెలిపారు. కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి సామరస్యపూర్వకంగా సమస్యలను పరిష్కరించాలని మొగిలి సూచించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆర్టీసీ సేవలు ప్రజలకు అత్యంత కీలకమైనవని, వాటి సజావుగా నడవడం కోసం కార్మికుల సంక్షేమం ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఆమోదిస్తే సమ్మెను విరమించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్మిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టెక్స్ టైల్ పార్కుకు కేంద్రం ఊతం..

- తొలి విడతగా రూ.30 కోట్లు విడుదల
- లోక్ సభలో ఎంపీ కడియం కావ్య వినతిపై కేంద్రం స్పందన
- వరంగల్ అభివృద్ధిలో మరో ముందడుగు



వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం, ఏప్రిల్ 24 :

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పార్కు అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ఆర్థిక సహకారం అందించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో రూల్ 377 కింద చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. పీఎం మిత్ర పథకం కింద ఈ ప్రాజెక్టును ప్రాధాన్యంగా తీసుకుంటున్నట్లు కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి గిరిరాజ్ సింగ్ వెల్లడించారు. మెగా టెక్స్‌టైల్ పార్కును త్వరితగతిన పూర్తి చేయాలని, దీనివల్ల వేలాది మందికి ఉపాధి లభిస్తుందని ఎంపీ కడియం కావ్య సభ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వినతిపై స్పందించిన కేంద్ర మంత్రి, ఇప్పటికే రూ.30 కోట్ల తొలి విడత నిధులను విడుదల చేసినట్లు ప్రకటించారు. మిగిలిన నిధులను అర్హతల ప్రాతిపదికన తదుపరి విడతల్లో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

### భారీగా ప్రోత్సాహకాలు..

పరిశ్రమలను ఆకర్షించేందుకు సుమారు రూ.300 కోట్ల వరకు ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం తెలిపింది. పీఎల్ఐ, సమర్థ్ వంటి పథకాల ద్వారా ఇక్కడ ఏర్పాటు చేసే యూనిట్లు లబ్ధి పొందవచ్చని మంత్రి పేర్కొన్నారు. ఎంపీ కడియం కావ్య నిరంతర కృషితో ఈ ప్రాజెక్టుకు నిధులు రావడంపై స్థానిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులోకి వస్తే వరంగల్ ప్రాంతంలో పెట్టుబడులు పెరగడంతో పాటు ఆర్థికాభివృద్ధి వేగవంతం కానుంది.



## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు టీఆర్పీ సంపూర్ణ మద్దతు


- జనగామలో టీఆర్పీ శ్రేణుల భారీ నిరసన..
- శంకర్ గౌడ్ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: టీఆర్పీ నేతల ధ్వజం..
- కార్మికుల ఉసురుపోసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గత పాలకుల గతే పడుతుంది
- ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

జనగామ, ఏప్రిల్ 24(ప్రభాత గమనం):

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు.. జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు భారీ మద్దతు లభించింది.జనగామ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా నిరసన తెలుపుతున్న టీఆర్పీ నాయకులు,కార్మికులు కలిసి సంఘీభావం ప్రకటించారు. ఇటీవల మరణించిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కట్ల సదానంద ముదిరాజ్ మాట్లాడుతూ.. నర్సంపేట లో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణం ఆత్మహత్య కాదని, అది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి శంకర్ గౌడ్ వారి కుటుంబానికి ₹5 కోట్ల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ముందు ఉంచిన,డిమాండ్లు ఆర్టీసీ కార్మికులు సుదీర్ఘ కాలంగా కోరుతున్న 32 న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి.అహంకారాన్ని వీడి ఆర్టీసీ జేఏసీ నాయకులతో ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలి. గతంలో ఆర్టీసీ కార్మికులతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ పార్టీకి పతనమైందని, ఇప్పుడు అధికారంలో ఉన్న 'రెడ్డి ప్రభుత్వం' కూడా అదే బాటలో నడిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నేడు అన్ని ప్రజా సంఘాలు,సంస్థలు ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలుస్తున్నాయని సదానంద ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జిట్టబోయిన నరేష్,టౌన్ అధ్యక్షులు గడ్డం కృష్ణ, మైనార్టీ అధ్యక్షులు ఎండి బబ్బులు, యూత్ నియోజకవర్గ అధ్యక్షులు బోడా రమేష్, ఎండి అంజద్ పాషా, పార్టీ కార్యకర్తలు జలీల్ పాషా, ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు

## బండి సంజయ్ పర్యటనను అడ్డుకోవడం సిగ్గుచేటు

- ఇది ప్రజాస్వామ్యమా లేక నిరంకుశత్వమా
- బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్



కేసముద్రం, ఏప్రిల్ 24(ప్రభాత గమనం):

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటనను అడ్డుకోవడం, బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని కేసముద్రం మండల బీజేపీ నాయకులు ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేఖర్ల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్, ప్రధాన కార్యదర్శులు బోగోజు నాగేశ్వరా చారి, బొనగిరి ఉపేందర్ మాట్లాడారు.. నర్సంపేటలో ఇటీవల మరణించిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న కేంద్ర మంత్రిని అడ్డుకోవడం అప్రజాస్వామికమని అన్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చడానికి వెళ్తే అభ్యంతరాలు ఎందుకని వారు ప్రశ్నించారు. "ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ముందస్తు అరెస్టులకు తెరలేపిందని తెలిపారు. ప్రజా గొంతుకను నొక్కేయాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు."కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో వరంగల్ జిల్లా బీజేపీ కార్యదర్శి రాణాప్రతాప్ రెడ్డి సహా పలువురు కీలక నాయకులను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా పర్యటించే హక్కును కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితమే

- బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి
- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా

మహబూబాబాద్ ఏప్రిల్ 24(ప్రభాత గమనం) :

నర్సంపేటకు చెందిన ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ నిర్లక్ష్యం, హామీల అమలు లోపం వల్లే జరిగిందని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనను "ప్రభుత్వ హత్య"గా అభివర్ణిస్తూ, బాధిత కుటుంబానికి తక్షణమే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిందని, అయితే రెండున్నర సంవత్సరాలు గడిచినా కూడా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. కార్మికులు పదేపదే ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తూ తమ సమస్యలను తెలియజేసినా, ప్రభుత్వం స్పందించకుండా కాలయాపన చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని చాలా కాలంగా కార్మికులు డిమాండ్ చేస్తున్నారని అశోకన్నా గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకుండా కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని, పైగా వారిపై ఒత్తిళ్లు, బెదిరింపులు పెంచుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు ఆవేదనతో సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కోలా శంకర్ గౌడ్ మృతి ఒక్కటే కాకుండా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో ఆర్టీసీ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడటం, నల్గొండ జిల్లాలో కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేయడం వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఇటువంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని అశోకన్నా కోరారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు.



CPI (M-L) NEW DEMOCRACY
సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ
Telangana State Committee
CP Bhavan, 2-1-716 (B-34), (F-1), Vidyanagar Railway Station Raod, Vidyanagar, Hyderabad - 500044.
State Secretary
Ashok
Dt.23-04-2026.

కోలా శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితమే.

- బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి:
సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా డిమాండ్.

నర్సంపేటకు చెందిన ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ నిర్లక్ష్యం, హామీల అమలు లోపం వల్లే జరిగిందని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనను "ప్రభుత్వ హత్య"గా అభివర్ణిస్తూ, బాధిత కుటుంబానికి తక్షణమే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిందని, అయితే రెండున్నర సంవత్సరాలు గడిచినా కూడా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. కార్మికులు పదేపదే ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తూ తమ సమస్యలను తెలియజేసినా, ప్రభుత్వం స్పందించకుండా కాలయాపన చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని చాలా కాలంగా కార్మికులు డిమాండ్ చేస్తున్నారని అశోకన్నా గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకుండా కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని, పైగా వారిపై ఒత్తిళ్లు, బెదిరింపులు పెంచుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు ఆవేదనతో సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కోలా శంకర్ గౌడ్ మృతి ఒక్కటే కాకుండా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో ఆర్టీసీ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడటం, నల్గొండ జిల్లాలో కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేయడం వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఇటువంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని అశోకన్నా కోరారు. కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారి హక్కులను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, సామాజిక భద్రత కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు.
ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, కార్మికుల హక్కుల సాధన కోసం పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని కామ్రేడ్ అశోకన్నా స్పష్టం చేశారు. [illegible]

మొత్తంగా, కోలా శంకర్ గౌడ్ మృతి రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల పరిస్థితిని ప్రతిబింబించే విషాద ఘటనగా మారిందని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

- ఉద్యోగుల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం
- నల్ల రిబ్బన్లు ధరించి నిరసన

వరంగల్ బ్యూరో ప్రభాత గమనం ఏప్రిల్ 24



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం కు మూడో రోజుకు చేరుకుంది. బస్ డిపోలో పోలీసులు మోహరించారు ప్రైవేటు బస్సులు కూడా బయటికి వెళ్లలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ నాయకులతో చేపట్టిన చర్చలు విఫలం కావడంతో నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తొర్రూర్ డిపో లో పనిచేస్తున్న కండక్టర్లు డ్రైవర్లు ఇతర సిబ్బం దిశుక్ర వారం మృతుని చిత్రపటానికి నివాళులు తెరిపి నోటికి నల్లరిబ్బన్లు ధరించి ర్యాలీగా డిపో నుండి బయలుదేరి గాంధీ సెంటర్ వరకు కొనసాగి తిరిగి బస్టాండ్ సెంటర్ వద్ద చేరుకుని నిరసన తెలుపుతూ మానవహారం చేపట్టారు ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు విలేకరులతో మాట్లాడుతూ తాము 41 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో తమ సమ్మెకు దిగడం జరిగిందని 32 డిమాండ్లలో 29 పరిష్కారాన్ని చేసామని చెప్తూ ప్రభుత్వం అసలైన మూడు డిమాండ్లను పట్టించుకోవడంతోనే కార్మికుడు డ్రైవర్ శంకర్ గౌడ్ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనే కారణంతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతను మృతి చెందడంతో ఆర్టీసీ కార్మికులు కలత చెందారని , అన్నారు ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో మహిళల ఉచిత ప్రయాణానికి తాము ఎంతో సహకరిస్తున్నామని మహాలక్ష్మి పథకం విజయవంతం అయిన సందర్భంగా కూడా మహిళలను పిలిచి సన్మానాలు కూడా చేశారని విజయానికి మా కండక్టర్లు డ్రైవర్లు ఎంతో కృషి చేశారని,కానీ తమను పట్టించుకోకపోవడంతో ఎంతో నిరాశకు లోనై తప్పనిసరిగా సమ్మెకు దిగాల్సి వచ్చిందని , ప్రభుత్వం వెంటనే ప్రధాన సమస్యలైనా మొదటిది తమ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని పెండింగ్లో ఉన్న రెండు పిఆర్సి లను వెంటనే చెల్లించాలని, 2015 ఇచ్చిన హామీని నెరవేర్చాలని, మేము గొంతెమ్మ కోరికలు ఏమి కోరట్లేమని ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన వాటిని పరిష్కరించాలని కోరుతున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చి ఆత్మహత్యలను నివారించాలని అన్నారు. ఆర్టీసీ సమ్మెకు సిపిఐ బిఆర్ఎస్ సిపిఐ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు ఆర్టీసీకార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



## శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి

- గౌడ యువజన సంఘం నాయకుడు కడెం ప్రశాంత్ గౌడ్
- గాంధీ కూడలిలో నల్ల బ్యాడ్జీలతో గౌడ యువజన సంఘం నిరసన
- ప్రభుత్వ నిర్లక్ష్యమే బలి తీసుకుందని ధ్వజం

డోర్నకల్, ఏప్రిల్ 24, ప్రభాత గమనం :

నిరంతరం ప్రజలకు సేవలందించే ఆర్టీసీ కార్మికుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని గౌడ యువజన సంఘం నాయకుడు కడెం ప్రశాంత్ గౌడ్ ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీన వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు.శుక్రవారం స్థానిక గాంధీ బొమ్మ కూడలి వద్ద గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి సంతాపం తెలుపుతూ, ఆయన కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు."సుమారు 22 ఏళ్ల పాటు ఆర్టీసీలో చిత్తశుద్ధితో సేవలందించిన శంకర్ గౌడ్, తన సమస్యలు పరిష్కారం కావడం లేదన్న ఆవేదనతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరం. ఇది కేవలం ఆత్మహత్య కాదు, ప్రభుత్వ ఉదాసీనత వల్ల జరిగిన హత్యే. కార్మికుల కష్టాలను, వారి న్యాయపరమైన డిమాండ్లను పట్టించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది."శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోస్ వెంకన్న, గండి సీతారాం, దేవేందర్, పొన్నం సైదులు, మంద వెంకన్న, రామూర్తి, బత్తిని ఉపేందర్, సతీష్, తండ శివ, శ్రీను, బంధం రవి, రాజు మరియు అధిక సంఖ్యలో కార్మికులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా సహాయ కార్యదర్శిగా కుంభ వెంకన్న

డోర్నకల్,ఏప్రిల్ 24(ప్రభాత గమనం):



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా సహాయ కార్యదర్శిగా కుంభ వెంకన్న(ప్రశాంత్)ను నియమించినట్లు ఉద్యమకారుల ఫోరం వరంగల్ చైర్మన్ నందగిరి రజనీకాంత్ ప్రకటనలో తెలియజేశారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రశాంత్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శాయశక్తుల ఉద్యమకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.ఎంపికకు సహకరించిన వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్,మానుకోట జిల్లా అధ్యక్షులు ముద్దసాని వెంకటేశ్వర్లు,జిల్లా ఉపాధ్యక్షులు మేకల రామారావు, మండల ప్రెసిడెంట్ అజ్మీర పర్శ నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ట్రాక్టర్ ఢీకొని బొడ్రాయిని ధ్వంసం

- భవానీగడ్డ తండాలో కలకలం...

కేసముద్రం, ఏప్రిల్ 24 ( ప్రభాత గమనం) :

కేసముద్రం మండలం భవానీగడ్డ తండా గ్రామ పంచాయతీలో ఒక వింత ఘటన చోటుచేసుకుంది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ ట్రాక్టర్, రోడ్డు పక్కన ఉన్న బొడ్రాయిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొడ్రాయి నుజ్జునుజ్జవ్వగా, ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి ఆనవాళ్లు లభించకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.స్థానికుల కథనం ప్రకారం.. ఎవరు లేని సమయంలో అతివేగంతో వచ్చిన ఒక ట్రాక్టర్ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న బొడ్రాయి ని బలంగా గుద్దింది.ఈ ప్రమాద తీవ్రతకు బొడ్రాయి పూర్తిగా దెబ్బతిన్నది. అయితే, ఈ ప్రమాదం జరిగిన వెంటనే సదరు డ్రైవర్ ట్రాక్టర్‌తో సహా అక్కడి నుండి పరారయ్యాడు.జన సంచారం తక్కువగా ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో ఎవరికి కాన రాలేదు. ప్రజలు తిరిగే సమయంలో పెద్ద ప్రమాదమే జరిగేదని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ( బొడ్రాయిని ) ధ్వంసం చేసి బాధ్యత లేకుండా వెళ్ళిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ట్రాఫిక్ సిబ్బందికి వాటర్ బాటిల్స్ పంపిణీ

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో

ఎండాకాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం మరియు సురక్షిత సేవల కోసం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే. సుజాత ఆధ్వర్యంలో, ట్రాఫిక్ ఏసీపీ టీ. సత్యనారాయణ చేతుల మీదుగా ట్రాఫిక్ సిబ్బందికి వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఎండాకాలంలో విధులు నిర్వహించే సిబ్బంది తగినంత నీరు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు. ఎండ తీవ్రత కారణంగా డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తే అవకాశమున్నందున, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## లంచం అడిగితే ఉపేక్షించేది లేదు

- పుల్లూరు గ్రామ సభలో సర్పంచ్ బాబురావు స్పష్టం

గార్ల, ఏప్రిల్ 24:(ప్రభాత గమనం)



పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గార్ల మండలం పుల్లూరు గ్రామంలో శుక్రవారం ఘనంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బాబురావు ప్రజలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పథకాలు, పింఛన్ల మంజూరు విషయంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు.గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయని, దీని కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని సర్పంచ్ స్పష్టం చేశారు. "పింఛన్ల కోసం గానీ, ఇతర ప్రభుత్వ పథకాల కోసం గానీ దళారుల చుట్టూ తిరగవద్దు. మీ హక్కును పొందడానికి ఎవరికీ లంచాలు పెట్టాల్సిన అవసరం లేదు" అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాలనలో అవినీతికి తావులేకుండా చూస్తామని పేర్కొంటూ, ఒకవేళ ఎవరైనా అధికారులు లేదా వ్యక్తులు పని చేసి పెట్టడానికి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని బాబురావు కోరారు. నిర్భయంగా ఫిర్యాదు చేస్తే, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- బీఆర్ఎస్ నేతల ధ్వజం

గార్ల, ఏప్రిల్ 24 ( ప్రభాత గమనం) :

కాలేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు అని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ఇల్లందు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి బానోతు హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు, గార్ల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.మండల పార్టీ అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు కాంగ్రెస్ తీరును తీవ్రంగా ఖండించారు.కాలేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ విచారణపై హైకోర్టు స్టే ఇవ్వడం హర్షనీయమని లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. ఈ తీర్పుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు న్యాయస్థానంలో భారీ ఊరట లభించిందని, తప్పుడు ఆరోపణలు చేసేవారి నోళ్లు మూతపడ్డాయని అన్నారు.ప్రాజెక్టు ప్రతిష్టను దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో వారికి తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు.తెలంగాణ వరప్రదాయిని అయిన కాలేశ్వరంపై కావాలనే విషప్రచారం చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు బుడిగ మురళి, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, మండల నాయకులు మీగడ శ్రీనివాస్, చంద్రశేఖర్, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.




## నర్సంపేట ఉద్రిక్తతలకు బండి సంజయే కారణం!

- బీజేపీ, బీఆర్ఎస్ లు శవ రాజకీయం చేస్తున్నాయి
- కేంద్రమంత్రి హోదా మర్చిపోయి రెచ్చగొడుతున్నారు
- శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ప్రభుత్వం
- కార్మికులు ఎవరూ తొందరపడవద్దు.. క్షుద్ర రాజకీయాలను నమ్మొద్దు
- ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్



హైదరాబాద్, ప్రభాత గమనం:

నర్సంపేటలో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి నేపథ్యంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలకు కేంద్రమంత్రి బండి సంజయ్ వైఖరే కారణమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని, అయితే ఆ విషాదాన్ని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

### శవ రాజకీయాలు మానుకోవాలి

"ఓ వైపు బీఆర్ఎస్ నేతలు కార్మికులను రెచ్చగొడుతుంటే.. మరోవైపు కేంద్రమంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు పెంచేలా ప్రవర్తించడం హేయనీయం" అని దయాకర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంటే, ప్రతిపక్షాలు అందులో ఓట్లు వెతుక్కుంటున్నాయని ఆరోపించారు.

### ప్రభుత్వం సానుభూతితో ఉంది

శంకర్ గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం పూర్తి సానుభూతితో ఉందని దయాకర్ స్పష్టం చేశారు. ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా బాధితులను కలిసి అండగా ఉంటామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. "గత బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరించిందో అందరికీ తెలుసు. కానీ మా ప్రభుత్వం కార్మికులతో నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ తొందరపడి ప్రాణాలు తీసుకోవద్దని, ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని దయాకర్ కోరారు. ఇలాంటి 'క్షుద్ర రాజకీయాలు' చేసే నాయకులను నమ్మి మోసపోవద్దని, కచ్చితంగా ప్రతి కార్మికుడికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పోలీసులతో నిర్బంధాలు ఆపాలి
- సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజు
- కేసముద్రంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ముందు నిరసన

కేసముద్రం, ఏప్రిల్ 24(ప్రభాత గమనం):



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్బి గెస్ట్ హౌస్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జల్లే జయరాజు, సీనియర్ నాయకులు చాగంటి కిషన్ మాట్లాడారు..కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలన్నీ తీర్చుతామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు.శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులను పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడం దుర్మార్గమని, ఐక్యతను దెబ్బతీయాలని చూడటం ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని వారు మండిపడ్డారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తూ కార్మికులను మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ మొండివైఖరి వల్లే నిన్నటి చర్చలు విఫలమయ్యాయని, దీనివల్ల మనస్థాపం చెంది నర్సంపేట డిపో డ్రైవర్ కోల శంకర్ గౌడ్ ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని తెలిపారు.ప్రభుత్వం ఇకనైనా మొండివైఖరి వీడి ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకన్న, వెంకన్న, కవిత, సత్తమ్మ, బిక్షపతి, మరియమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374